క్లుప్తంగా

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ


మొక్కలు నాటుతున్న సిబ్బంది

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఆర్ఎంహెచ్‌పీ) విభాగంలో మంగళవారం మొక్కలు నాటారు. విభాగం ఓర్ హ్యాండ్లింగ్ ప్లాంట్, ఏరియా షాప్ ఆఫీస్–3ల వద్ద పెద్ద ఎత్తున చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విభాగాధిపతి పరుచూరి శ్రీనివాస్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా నేరెడు మొక్కలు, కానుగ మొక్కలు, వేప మొక్కలు నాటుతున్నామన్నారు. విభాగం హెచ్ఆర్ అధికారి సుబ్రహ్మణ్యం, కె.వి.శేషగిరిరావు, వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బంగారు పతకం సాధించిన ఉద్యోగులకు అభినందన


ఉద్యోగులను అభినందిస్తున్న ఉన్నతాధికారులు

పెదగంట్యాడ: ఈ నెల 1న చైనాలో నిర్వహించిన క్వాలిటీ సర్కిల్ పోటీల్లో బంగారుపతకం సాధించిన స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేస్ ఉద్యోగులు ఎం.శరత్, అహ్మద్ వల్లీ, టీవీ రమణ, పెంటయ్య, భవానీ ప్రసాద్‌లను జీఎం ఐరన్ రంజన్ మహంతి, బ్లాస్ట్ ఫర్నేస్ విభాగాధిపతి ఉద్దం నాగ్ మంగళవారం అభినందించారు. వారు మాట్లాడుతూ ఉక్కు ఉత్పత్తిలోనే కాకుండా ఇతర రంగాల్లోనూ ఉక్కు ఉద్యోగులు సత్తా చాటడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.రాజారావు, అజయ్‌కుమార్ రెడ్డి, వెంకటేశ్వర్లు, కేఎల్ ప్రసాద్, గుప్తా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కరణంరెడ్డికి కాపు సంఘం నాయకుల సత్కారం


నర్సింగరావును సత్కరిస్తున్న కాపు సంఘం నాయకులు

గాజువాక: శ్రీరాజమాతా విజయరాజీ సింధియా ఫౌండేషన్ నుంచి రాజమాతా భారత్ గౌరవ్ పురస్కారం అందుకున్న కరణంరెడ్డి నర్సింగరావును శ్రీకృష్ణదేవరాయ గాజువాక కాపు సంక్షేమ సంఘం నాయకులు మంగళవారం ఘనంగా సత్కరించారు. సంఘం అధ్యక్షుడు జెర్రిపోతుల ముత్యాలు ఆధ్వర్యంలో నర్సింగరావును సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తలారి వెంకట రమణ, కరణం బాబూరావు, ముమ్మన అప్పారావు, గోపిశెట్టి సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం


అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

పోటీ ఏదైనా.. పతకం ఖాయం

విద్యార్థుల్లో భావనాశక్తి అపారం. వారి అభిరుచి, ఆసక్తిని గమనించి.. సహజ నైపుణ్యానికి మెరుగులు అద్దే గురువు లభిస్తే వారి ప్రతిభకు ఆకాశమే హద్దు. చక్కగా ప్రోత్సహిస్తే విజయాలెన్నో వరించి వస్తాయి. ఇందుకు నిదర్శనం గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులే. కాన్సెప్ట్‌కు అనుగుణంగా తమ ఊహలకు రెక్కలు తొడిగి, వారు వేస్తున్న ఎన్నో చిత్రాలు బహుమతులు పొందాయి. పాఠశాలకు ప్రత్యేక గుర్తింపునీ తీసుకువచ్చాయి. గత ఆరు నెలల్లో వారు సాధించిన విజయాలే ఇందుకు తార్కాణం.

- చిత్రలేఖనంలో గాజువాక హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ
- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు


చిత్రలేఖనం సాధన చేస్తున్న విద్యార్థులు

గాజువాక: చిత్రలేఖనంలో గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ ప్రదర్శిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బహుమతులను సొంతం చేసుకుని, ప్రశంసలు అందుకుంటున్నారు. డ్రాయింగ్ టీచర్ భావనారుషి ఆధ్వర్యంలో చిన్నారులు తర్ఫీదు పొందుతూ పోటీలు ఎక్కడ జరిగినా హాజరై సత్తా చాటుతున్నారు. విద్యార్థులు ప్రతీ రోజు అరగంటపాటు చిత్రలేఖనంలో సాధన చేస్తున్నారు. ఎలాంటి చిత్రాలు గీయాలి, ఏ బొమ్మలు ఆకర్షణీయంగా ఉంటాయి, ఏ బొమ్మకు ఎలాంటి రంగులు వేయాలి తదితర అంశాలపై ఉపాధ్యాయుల సూచనలను పాటిస్తూ సాధన చేస్తున్నారు.

ఎన్నెన్నో పోటీలు.. అన్నింటా బహుమతులు

అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర, జోనల్, జిల్లా స్థాయిలో ఎక్కడ పోటీలు జరిగినా.. గాజువాక హైస్కూల్ నుంచి పాల్గొంటున్న చిన్నారులు బహుమతులను సొంతం చేసుకుంటున్నారు.

చిత్రలేఖనంలో కొన్ని మెరుపులు

- కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఇటీవల అంతర్జాతీయ స్థాయిలో వివిధ ప్రాంతాలకు చెందిన చిన్నారులు గీసిన చిత్రాలతో రూపొందిన మై మదర్‌ల్యాండ్ బొమ్మల పుస్తకంలో గాజువాకకు చెందిన ముగ్గురు విద్యార్థినులకు చోటు దక్కింది.
- హైదరాబాద్‌లో ప్రతాప్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గత నెల నిర్వహించిన జాతీయ స్థాయి పోటీలకు గాజువాక హైస్కూల్ నుంచి హాజరైన 50 మంది విద్యార్థుల్లో 25 మంది స్వర్ణ పతకాలను సొంతం చేసుకున్నారు. వారిలో తొమ్మిదో తరగతి చదువుతున్న కె.లహరి ద్వితీయస్థానాన్ని సాధించింది.
- ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా హైదరాబాద్‌కు చెందిన యంగ్ ఇన్వాయిస్ ఇంటర్నేషనల్ సంస్థ నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీలకు 190 మంది విద్యార్థులు హాజరు కాగా, 24 మందికి బంగారు పతకాలు దక్కాయి. 51 మంది విద్యార్థులకు జ్యూరీ అవార్డులు లభించాయి.
- కేంద్ర డిఫెన్స్ మంత్రిత్వశాఖ, కేంద్ర విద్యాశాఖ నిర్వహించిన వీరగాథ 3.0 చిత్రలేఖనం పోటీల్లో ముగ్గురు విద్యార్థులకు సర్టిఫికెట్లు లభించాయి.
- ఇటీవల చోడవరంలో నిర్వహించిన జాతీయస్థాయి చిత్రలేఖనం పోటీల్లో ఐదుగురు విద్యార్థులు బంగారు పతకాలను సాధించారు.
- వారం రోజుల క్రితం రంగోత్సవ్ పేరుతో ముంబైలో నిర్వహించిన జాతీయస్థాయి చిత్రలేఖనం పోటీలకు ఈ పాఠశాల నుంచి 180 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇంకా ఫలితాలు విడుదల కావాల్సి ఉంది.

వివిధ పోటీల్లో బహుమతులు పొందిన చిత్రాలు



బంగారు పతకాలు, సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ప్రధానోపాధ్యాయిని, ఉపాధ్యాయులు (ఫైల్)

ఆసక్తికి అనుగుణంగా శిక్షణ



చిత్రలేఖనంలో విద్యార్థుల ఆసక్తిని తెలుసుకుని శిక్షణ ఇస్తున్నాం. వారి అభిరుచులకనుగుణంగా విద్యార్థులు చిత్రాలను గీస్తారు. వారికి ప్రతీరోజు కొంత సమయం డ్రాయింగ్ నేర్పిస్తూ వారి ప్రతిభకు పదును పెడతాం. మా ప్రధానోపాధ్యాయిని కె.విజయ ప్రశాంతి విద్యార్థులను బాగా ప్రోత్సహిస్తున్నారు. ఏ పోటీలు జరిగినా విద్యార్థులు పాల్గొనేలా చేస్తున్నాం. వారు గెలుచుకున్న బహుమతులు వారికి మరింత ప్రోత్సాహాన్ని ఇస్తున్నాయి. – భావనా రుషి, డ్రాయింగ్ టీచర్

నేడు 12 గంటల నిరవధిక దీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న డీవీఆర్

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు డెమోక్రటిక్ విశాఖ రిపబ్లిక్ (డీవీఆర్) స్టీల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పెదగంట్యాడ జంక్షన్‌లో బుధవారం 12 గంటల నిరవధిక నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు యూనియన్ ప్రెసిడెంట్ ధర్మాల వెంకట రమణారెడ్డి తెలిపారు. గంగవరంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన ఉక్కు పరిరక్షణ ఉద్యమం బుధవారం నాటికి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలియజేశారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు గల్లా శంకర్ సాయిరాం, పేర్ల నూకరాజు, నల్లయ్య, రాజా, నొల్లి ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనను విజయవంతం చేయాలి: మంత్రి రాజశేఖర్

ఉక్కు పరిరక్షణ ఉద్యమం వెయ్యి రోజులు పూర్తవుతున్న సందర్భంగా దీక్ష శిబిరం వద్ద బుధవారం చేపట్టనున్న ఆందోళన కార్యక్రమంలో ఉక్కు ఉద్యోగులు, కార్మికులు, నిర్వాసితులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ పిలుపునిచ్చారు. నడుపూరులో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకునేందుకు ఎన్ని ఉద్యమాలైనా చేస్తామని ప్రకటించారు. సమావేశంలో కారు రమణ, బీఎస్ రాజు, సురేంద్ర, మంత్రి గోపీ, బైరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రజల సంపద

- పరిశ్రమను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడం దారుణం
- ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు వద్ద మానవహారం


స్టీల్‌ప్లాంట్ గేటు వద్ద మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

ఉక్కునగరం: విశాఖ ఉక్కు కర్మాగారం ప్రజల సంపద అని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఆ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ప్రయత్నాన్ని మోదీ ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు మెయిన్ గేటు వద్ద పోరాట కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మానవహారం నిర్వహించారు. కేంద్రప్రభుత్వ వైఖరిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, నీరుకొండ రామచంద్రరావు, జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులకు మద్దతు ఇస్తున్న మోదీ వైఖరిని పోరాట కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ఉక్కు దీక్షలు 1000 రోజులకు చేరుకుంటున్న సందర్భంగా బుధవారం ఉదయం కూర్మన్నపాలెం కూడలిలో జరిగే దీక్షలో కుటుంబాలు వేలాదిగా పాల్గోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కె.ఎస్.ఎన్.రావు, యు.రామస్వామి, వై.మస్తానప్ప, బీఎంకె నాయక్, జె.రామకృష్ణ, వై.టి.దాస్, డి.అప్పారావు, సన్యాసిరావు, బొడ్డు పైడిరాజు, రామ్మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ

- ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- 999వ రోజుకు 'ఉక్కు' దీక్షలు


దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వ తీరుతో కార్మికుల హక్కులకు, వారి సంక్షేమానికి విఘాతం కలుగుతోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. మహనీయుల త్యాగాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 999వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ఎఫ్ఎండీ, ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్, సీఎంఈ, ప్లాంట్ డిజైన్, వీఎస్‌జీహెచ్ విభాగ కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం ప్రభుత్వరంగంలోనే కొనసాగుతుందని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టమైన హామీ ఇచ్చే వరకు దీక్ష కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ముగిసిన ఖోఖో శిక్షణ శిబిరం

రేపటి నుంచి చిత్తూరులో రాష్ట్ర స్థాయి పోటీలు


రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనున్న ఖోఖో జట్లతో కోచింగ్ క్యాంప్ నిర్వాహకులు

అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనున్న జట్లకు శిక్షణ శిబిరం ముగిసింది. ఉమ్మడి విశాఖ జిల్లా ఖోఖో అండర్–14 (బాలురు, బాలికల) జట్లకు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వారం రోజుల పాటు కోచింగ్ క్యాంప్ నిర్వహించి, ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. పాఠశాల హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు పర్యవేక్షణలో పీడీలు లక్ష్మీరాణి, శ్యామ్, వీరు నాయుడు ఆధ్వర్యంలో క్యాంప్ నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న హెచ్ఎం నాగేశ్వరరావు మాట్లాడుతూ క్రీడాకారులు వారం రోజుల పాటు సుశిక్షితులైన వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో శిక్షణ పొంది, ఆటలో మెలకువలు నేర్చుకుని, ఈ నెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు చిత్తూరులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు సన్నద్ధులు కావడం సంతోషంగా ఉందన్నారు. పోటీలో సత్తా చాటి ఉమ్మడి విశాఖ జిల్లాలకు గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ అనకాపల్లి జిల్లా కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయుల జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి కె.ఎం.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైళ్లలో బాణసంచా రవాణా నిషేధం


విశాఖ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న సివిల్ డిఫెన్స్ సభ్యులు

తాటిచెట్లపాలెం: దీపావళి సమీపిస్తున్న నేపథ్యంలో వాల్తేరు డివిజన్‌లో ప్రత్యేక డ్రైవ్‌లకు శ్రీకారం చుట్టింది. రైళ్లలో దీపావళి సామగ్రి తరలించకూడదని, మండే స్వభావం గల పదార్థాలు తరలించకూడదని విస్తృత ప్రచారం చేస్తోంది. ఇందులో భాగంగాలో రైళ్లల్లో తనిఖీలు నిర్వహిస్తోంది. ప్రత్యేక స్క్వాడ్‌ను నియమించింది. డివిజన్ పరిధిలోని విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం రైల్వేస్టేషన్‌లలో రైల్వే అధికారులు, సివిల్ డిఫెన్స్ సభ్యులు, రైల్వే భద్రతా దళం సిబ్బంది రైళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్నారని డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ తెలిపారు. ప్రయాణికుల బ్యాగులను, లగేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, ఎప్పటికప్పుడు వీటిపై అనౌన్స్‌మెంట్స్ ద్వారా ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎవరైనా రైళ్లలో, రైల్వే స్టేషన్‌లలో టపాసులు, మండే ప్రమాదకర పదార్థాలు రవాణా చేస్తున్నట్లు గమనిస్తే వెంటనే రైల్వే అధికారులకు తెలియజేయాలని సూచించారు.

శాస్త్ర విజ్ఞానంతోనే అభివృద్ధి


శాస్త్ర విజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు

పెదగంట్యాడ: శాస్త్ర విజ్ఞానంతోనే అభివృద్ధి సాధ్యమని జన విజ్ఞాన వేదిక విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీకే పరశురాం అన్నారు. ఆలిండియా పీపుల్స్ సైన్స్ నెట్ వర్క్ (ఏఐపీఎస్ఎన్), జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైంటిఫిక్ టెంపర్‌మెంట్ (శాస్త్ర ప్రచార) కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ శాస్త్రవేత్తలు సర్ సీవీ రామన్, మేడం మేరీ క్యూరీ జయంతిని పురస్కరించుకుని దేశ వ్యాప్త ప్రచార కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల్లో, ప్రజల్లో సైంటిఫిక్ టెంపర్‌మెంట్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ నెల 7 నుంచి 28 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయుడు సురేష్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలకు అభ్యంతరాల జాబితా


సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో లక్ష్మారెడ్డి

గాజువాక: ఓటర్ల జాబితాల్లో మార్పులు, చేర్పులకు సంబంధించి గత నెల 27 నుంచి ఈ నెల 6వ తేదీ వరకు అందిన క్లెయిమ్‌లు, వివిధ ఫారాల ద్వారా అందిన అభ్యంతరాల జాబితాను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులకు ఎన్నికల విభాగం అధికారులు అందజేశారు. ఆయా పార్టీల నాయకులతో జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో గాజువాక ఓటర్ల నమోదు అధికారి (ఈఆర్వో) డి.లక్ష్మారెడ్డి ఈ జాబితాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తింపు పొందిన ప్రతీ రాజకీయ పార్టీ నుంచి ప్రతీ పోలింగ్ స్టేషన్ వద్ద ఒక బీఎల్ఏను నియమించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ పి.సింహాచలం, తహసీల్దార్లు రమాదేవి, శ్రీవల్లి, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్కేటింగ్ పోటీల్లో విజేతలకు ప్రశంసలు


స్కేటింగ్ విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జాకబ్

ఉక్కునగరం: స్థానిక డీపాల్ పాఠశాల విద్యార్థులకు అంతర జిల్లా స్కేటింగ్ పోటీల్లో పలు పతకాలు లభించాయి. తణుకులో నవంబర్ 1 నుంచి 4 వరకు 35వ ఏపీ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్కేటింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న పాఠశాల ఏడో తరగతి విద్యార్థి అంబటి సంజీవ కుమార్ సబ్ జూనియర్ బాలుర పోటీలు, మిక్స్‌డ్ టీమ్ పోటీల్లో రెండు బంగారు పతకాలు గెలుపొందాడు. అదే విధంగా పాఠశాలకు చెందిన ఎం.ఎం.యోషిత, ఎస్.పి.పల్లవి, సిహెచ్.లేఖ్య, బి.సాహితి, సిహెచ్.వి. తుషార్‌లకు సబ్ జూనియర్ బాలురు, బాలికల పోటీల్లో బంగారు పతకాలు లభించాయి. ఎస్.హెచ్.పి.వైష్ణవి, ఎం.ఎం.జతిన్ కృష్ణ క్యాడెట్ బాలికలు, బాలుర కేటగిరీల్లో బంగారు పతకాలు సాధించారు. పాఠశాలకు ఓవరాల్ చాంపియన్‌షిప్ లభించింది. ఈ సందర్భంగా పాఠశాలలో మంగళవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఫాదర్ జాన్సన్ జాకబ్ విజేతలను అభినందించారు.

ఘనంగా ఎన్టీపీసీ వ్యవస్థాపక దినోత్సవం



సింహాద్రి ఎన్టీపీసీ హెడ్ సిన్హాకు కేక్ తినిపిస్తున్న అధికారులు

పరవాడ: ఎన్టీపీసీ 49వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సింహాద్రి ఎన్టీపీసీ పరిపాలన భవనంలో ప్రాజెక్టు హెడ్ సంజయ్ కుమార్ సిన్హా ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీపీసీ ఎండీ గురుదీప్‌సింగ్ ఉద్యోగులనుద్దేశించి మాట్లాడారు. సంస్థ ప్రగతిలో కీలక భూమిక పోషిస్తున్నారని అభినందించారు. అనంతరం సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సిన్హా ఎన్టీపీసీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీపీసీ 48 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో 73,874 ఎండబ్ల్యూ సాధించిందని వివరించారు. రానున్న సంవత్సరంలో నిర్దేశించిన మైలురాళ్లను చేరుకోవడానికి కొత్త శక్తితో కష్టపడి పనిచేయాలని కోరారు. సింహాద్రి ఎన్టీపీసీ వివిధ రంగాల్లో సాధించిన అవార్డులు, ప్రశంసలను వివరించారు. వేడుకల్లో భాగంగా హిందీ పక్వాడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధికారులు ఎస్.గోవిందరాజన్, అంజూ సిన్హా, హెచ్ఆర్ హెడ్ రుమా డీ శర్మ, సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ వి.కె.ప్రభాకర్ పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డులో భవన నిర్మాణ వ్యర్థాలు

- రేగుతున్న దుమ్ము
- ప్రమాదకరంగా మార్గం


సర్వీసు రోడ్డు పక్కనే కుప్పలుగా పేరుకుపోయిన డెబ్రిస్

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ పెట్రోల్ బంక్ నుంచి అక్కిరెడ్డిపాలెం వైపు మార్గంలో సర్వీసు రోడ్డు డంపింగ్ యార్డును తలపిస్తోంది. రోడ్డుపై భవన నిర్మాణ వ్యర్థాలు డంప్ చేస్తుండటంతో రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. ఈ ప్రాంతంలో రోడ్డు గోతులమయం కావడంతో ఆ గోతులను రాళ్లతో కప్పేశారు. కానీ రాళ్లు పైకి తేలి ఉండడంతో వాహనాలు ప్రయాణించే అవకాశం లేదు. రోడ్డు పక్కనే డెబ్రిస్ డంప్ చేయడంతో భారీవాహనాల రాకపోకల సమయంలో దట్టమైన దుమ్ము లేచి, ఆ ప్రాంతం అంతా కప్పేస్తోంది. ఆ సమయంలో వెనక వచ్చే వాహనచోదకులపై ఆ దుమ్ము పడి ఇబ్బందికరంగా ఉంటోంది. రోడ్డు గోతులతో నిండి ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. హైవే అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు కోరుతున్నారు.

మాతాశిశు మరణాల రేటు తగ్గుదలకు కృషి


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు. చిత్రంలో సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మ

మహారాణిపేట: మాతాశిశు మరణాల రేటు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని, దీనిపై అందరిలో అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. మంగళవారం రేసవానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో శిశు సంరక్షణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసంగించారు. మాతాశిశు మరణాలను తగ్గించడానికి ప్రతి ఏడాది నవంబర్ 7న శిశు సంరక్షణ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. నవజాత శిశువుల్లో రోగ నిరోధక శక్తిని పెంపొందించి శిశు మరణాల రేటు తగ్గించడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో అవగాహన కల్పించడమే ప్రధాన ఉద్దేశ్యమన్నారు. డిస్ట్రిక్ట్ సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మ మాట్లాడుతూ గైనిక్ విభాగంలో లేబర్ రూమ్‌లో బయో మెడికల్ వేస్ట్ గురించి ఆస్పత్రుల నిర్వాహకులకు అవగాహన కల్పించాలన్నారు. కేజీహెచ్ పిల్లల విభాగాధిపతి డాక్టర్ ఎంఎస్ రాజు మాట్లాడుతూ చిన్నారులకు వచ్చే వ్యాధులను తల్లి గుర్తించి వైద్యం చేయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ గైనకాలజిస్టు డాక్టర్ షర్మిల, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.వెంకటేశ్వరి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవనరాణి, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణ అధికారి (డెమో) బి.నాగేశ్వరరావు, కేజీహెచ్ పిల్లల డాక్టర్ పి.చక్రవర్తి, డాక్టర్ శరణ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఐ.మనోరమ తదితరులు పాల్గొన్నారు.